సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 5 । మార్చి । 2023




అడవిలో అగ్ని ప్రమాదాలు

రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నివారణపై అటవీశాఖ దృష్టి సారించింది. 8లో



సుధాకర్‌ను గెలిపిద్దాం 8లో

వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దామని పర్యాటకశాఖ మంత్రి రోజా పిలుపునిచ్చారు.



నేడు పాగును పండగ 8లో

మండల కేంద్రంలోని పెద్దూరులో ఆదివారం పాగును (హోలీ) పండగ నిర్వహించేందుకు పోతురాజు ఆలయాన్ని ముస్తాబు చేశారు.

న్యూస్‌రీల్

కోరుకొండ సైనిక్ స్కూల్‌కు ఏకలవ్య విద్యార్థి



రేణు వెంకట వినాయక్

మారేడుమిల్లి: స్థానిక ఏకలవ్య మోడల్ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి కొట్టం రేణు వెంకట వినాయక్ కోరుకొండ సైనిక స్కూల్‌లో ప్రవేశానికి అర్హత సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్‌జీ కృష్ణబాబు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆయనతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎన్‌టీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలో లువ్వాసింగి పంచాయతీ వంచేబు గ్రామానికి చెందిన ఎం ఈశ్వరమ్మ శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. గ్రామం నుంచి వాహనంలో ఆమెను తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆడ శిశువుకు జన్మనిచ్చిందని 108 ఈఎన్‌టీ శ్రీను, పైలెట్ వినోద్ తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు. వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించినట్టు వారు పేర్కొన్నారు.

'నైట్‌హాల్ట్ హట్స్' నిలిపివేత

నిర్వాహకుడికి నోటీసు



నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న ఎఫ్‌ఎస్‌వో బుచ్చిరాజు

వీఆర్‌పురం: మండలంలోని పాపికొండల అభయారణ్యం పరిధి కొల్లూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నైట్‌హాల్ట్ హట్స్ నిర్వహణ నిలిపివేయాలని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌ఎస్‌వో బుచ్చిరాజు సూచించారు. ఈ మేరకు సంబంధిత నిర్వాహకుడికి శనివారం నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన వివరించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఈ ప్రాంతంలో పాపికొండలు పర్యాటకులకు ఎలాంటి వసతి కల్పించకూడదని ఆయన ఆదేశించారు.

మాతృభాషలో బోధనతో మంచి ఫలితాలు

చింతూరు: మాతృభాషలో బోధనతో విద్యార్థులు సులువుగా విద్యనభ్యసించే అవకాశముందని ఐటీడీఏ ఏపీవో రాజ్‌కుమార్, ఎంఈవో లక్ష్మీనారాయణ అన్నారు. మాతృభాష ఆధారిత బహుభాష విద్య అమలు అనే అంశంపై ఈనెల ఆరో తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులు శనివారం చింతూరులో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు మాతృభాషలో బోధించడం ద్వారా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు సులువుగా బోధించేందుకు వీలుగా ప్రభుత్వం సంబంధిత ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. శిక్షణలో గ్రహించిన అంశాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని వారు సూచించారు.

పెట్టుబడుల సాధనలో..
విశాఖ.. విజేత

- బహుళ ప్రాజెక్టులకు కేంద్రంగా వైజాగ్
- రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థల ఎంవోయూలు
- విజయవంతంగా ముగిసిన జీఐఎస్– 2023



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు



పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సర్బానంద సోనోవాల్, మంత్రులు అమర్‌నాథ్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: పెట్టుబడిదారులను ఆకర్షించడంలో సాగరనగరి సఫలీకృతమైంది. బహుళ ప్రాజెక్టుల కేంద్రంగా విశాఖకు పట్టం కడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 సాక్షిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికాభివృద్ధికి కొత్తదారులు ఆవిష్కృతం చేశారు. దీంతో ఆర్థిక రాజధానికి ఆశల తోరణం కడుతూ.. పెట్టుబడులు ప్రవాహంలా వెల్లువెత్తాయి. రెండో రోజూ అదే జోరుతో రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులతో ఉమ్మడి విశాఖ సరికొత్త కళను సంతరించుకుంది. మొత్తంగా జీఐఎస్ సదస్సు నవశకానికి నాంది పలికింది.

అంతర్జాతీయ వాణిజ్య రంగాన్ని శాసిస్తున్న దిగ్గజ పారిశ్రామికవేత్తల రాకతో రెండు రోజుల పాటు విశాఖలో పండగ వాతావరణం నెలకొంది. 25 దేశాల నుంచి 46 మందికిపైగా రాయబారులు హాజరవ్వగా.. 45 దేశాలకు చెందిన ప్రతినిధులు రెండు రోజులపాటు సాగర నగరిలో సందడి చేశారు. దక్షిణ భారతదేశంలో గత కొన్నేళ్లుగా వివిధ నగరాల్లో నిర్వహించిన వాణిజ్య సదస్సులకు సైతం హాజరుకాని దిగ్గజ పారిశ్రామికవేత్తలంతా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానంతో విశాఖలో అడుగు పెట్టారు. రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను.. విభిన్న ప్రాజెక్టులకు సిటీ ఆఫ్ డెస్టినేషన్‌గా విశాఖను నిలబెట్టారు. రెండు రోజుల్లో రూ.13.41లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరగ్గా.. ఇందులో లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టులు విశాఖలో కార్యరూపం దాల్చనున్నాయి. తద్వారా వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

రెండు రోజుల్లో.. రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడులు

రెండు రోజుల పాటు నిర్వహించిన జీఐఎస్‌లో దిగ్గజ పారిశ్రామిక సంస్థలు రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. తొలి రోజున రూ.1.25 లక్షల కోట్లు పెట్టుబడులు రాగా.. రెండో రోజున మరో రూ.25 వేల కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు ప్రాథమికంగా గణించారు. ప్రాజెక్టుల విభజన, భూముల కేటాయింపు తదితర ప్రక్రియ పూర్తయిన తర్వాత విశాఖ జిల్లాకు వచ్చిన అసలు పెట్టుబడుల లెక్కలు ప్రకటిస్తామని ప్రభుత్వాధికారులు స్పష్టం చేశారు. మొదటి రోజున ఒబెరాయ్, ఎన్‌టీపీసీ తదితర సంస్థలు ఎంవోయూలు చేసుకోగా.. రెండో రోజున పల్సస్, తాజ్‌గ్రూప్, హెచ్‌పీసీఎల్ మొదలైన సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. క్షేత్రస్థాయిలో ఈ ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయితే లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

నాలుగు ప్రాజెక్టులు ప్రారంభం

సదస్సు ప్రాంగణం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 14 ప్రాజెక్టుల కార్యకలాపాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో నాలుగు సంస్థలు ఉమ్మడి విశాఖలో ఉండటం విశేషం. అచ్యుతాపురం సెజ్‌లో రూ.460 కోట్ల పెట్టుబడితో లారస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. దీని ద్వారా 1,200 మందికి ఉపాధి లభించింది. అచ్యుతాపురం సెజ్‌లోనే బల్క్ డ్రగ్‌కు సంబంధించి అమరాలైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యకలాపాలను సీఎం జగన్ ప్రారంభించారు. రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సంస్థ ద్వారా 190 మందికి ఉపాధి కల్పించారు. సెరామిక్, పాలిమరిక్ తదితర హైవోల్టేజ్ ఇన్సులేటర్స్ తయారు చేసే ప్రాజెక్టును రూ.174 కోట్లతో విన్‌విన్ స్పెషాలిటీ ఇన్సులేటర్స్ లిమిటెడ్ నిర్మించింది. దీని ద్వారా 500 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. అలాగే అనకాపల్లిలో రూ.200కోట్లతో ఏవోవీ అగ్రో ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించిన మీట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. ఈ కంపెనీ ద్వారా 1000 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. మొత్తంగా రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విశాఖపట్నం ప్రధాన పాత్ర పోషించిందంటూ దిగ్గజ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు కూడా ప్రశంసల జల్లు కురిపించాయి.



సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు

జీ-20లో మళ్లీ కలుద్దాం

ఆత్మీయ అతిథులకు నమస్సుమాంజలి.. **నన్ను ప్రపంచానికి** సరికొత్తగా పరిచయం **చేసిన 45 దేశాలు.. 100** మంది దిగ్గజ పారిశ్రామి**కవేత్తలు.. 14 వేల** మంది ప్రతినిధులందరికీ **వందనాలు.** డైనమిక్ లీడర్, ముఖ్యమంత్రి **వైఎస్ జగన్‌మోహ**న్‌రెడ్డి పిలుపుతో పరిపా**లన రాజధానిగా అడు**గులు వేస్తున్న నా ఒడికి **చేరుకున్న మీ అందరికీ** ఆత్మీయ ఆతిథ్యం అం**దించాను. ఆంధ్రా** వంటకాల రుచులు **చూపించాను. నా ప్రజల** ప్రేమను పరిచయం **చేశాను. గ్లోబల్ ఇన్వెస్టర్స్** సమ్మిట్‌కు హాజరైన **మీ అందరికీ మరిచిపోలేని** జ్ఞాపకాలను **మూటగట్టి మీ వెంట** పంపిస్తున్నాను. కోవిడ్ **తర్వాత కొత్త ఊపిరి** పోసుకుంటున్న మా **రాష్ట్రంలో పెట్టుబడుల**కు ఆసక్తి చూపుతూ.. **ఆర్థిక భరోసా** అందించినందుకు ప్రతి **ఒక్కరికీ పేరు పేరునా** కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ఎప్పుడూ చూడని దిగ్గజ పారిశ్రామికవేత్తలు తరలిరావడం అపురూప కానుకగా భావిస్తున్నా. టూరిజం ప్రాజెక్టులు, రెస్టారెంట్లు, హోటళ్లు, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్, పునరుత్పాదక ఇంధన వనరులు.. ఇలా విభిన్న రంగాల్లో భిన్నమైన ప్రాజెక్టులను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల యాజమాన్యాలకు ఇక్కడ ప్రజలంతా రుణపడి ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహించిన జీఐఎస్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇదే స్ఫూర్తితో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే జీ–20 సదస్సుకు మీరంతా వస్తున్నట్లు తెలిసింది. జీ–20కి వచ్చే అతిథులందరినీ మరింత ప్రేమతో అక్కున చేర్చుకునేందుకు ఇప్పటి నుంచే ముస్తాబవుతా. మీ అందరి కోసం 28వ తేదీన నా ప్రజలందరితో కలిసి ఎదురుచూస్తుంటా.!

బై..బై..
మీ.. విశాఖ నగరం

– కరుకోల గోపీ కిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు

- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరిక
- పాఠశాలల్లో విస్తృత తనిఖీలు
- సిలబస్ పూర్తికాకపోవడంపై ఆగ్రహం
- బాధ్యులనుంచి వివరణ తీసుకోవాలని ఆదేశం



మారేడుమిల్లి కస్తూర్బాలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్



రంపచోడవరం జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనుల వివరాలను తెలుసుకుంటున్న ప్రవీణ్‌ప్రకాష్

మారేడుమిల్లి: ఉపాధ్యాయులు, సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తొలుత స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులకు గాను 10 మంది ఉపాధ్యాయులు ఉండటంపై ప్రశ్నించారు. పక్క పక్కనే వరుసగా పాఠశాలలు ఉండడాన్ని ఆయన గమనించారు. వీటిని ఒకే పాఠశాలలో విలీనం చేసి విద్యార్థులకు మంచి విద్యను అందించకుండా వేరువేరుగా ఉంచి ప్రభుత్వ సొమ్మును వృథా చేస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలను, బోధన విధానాన్ని పరిశీలించారు. ఇదే నెలలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో 40 శాతం మాత్రమే సిలబస్ పూర్తిచేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. జూన్, జూలై నెలలో ఉపాధ్యాయులను నియమించాల్సి ఉండగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నియమించడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని ప్రభావం సిలబస్‌పై చూపుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలను ఆయన తిలకించారు. వారిని అభినందించారు. పందిరి మామిడి కోట ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. మెనూ, స్టాక్ రూమ్‌ను తనిఖీ చేశారు. అదనంగా కోడిగుడ్లు నిల్వ ఉండటంపై డీఈవో, ఎంఈవోలను ప్రశ్నించారు. తరచూ క్షేత్రస్థాయిలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిలబస్ ప్రకారం బోధన జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బాధ్యుల నుంచి వివరణ తీసుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేను ఆదేశించారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డీఈవో రమేష్, ఎంఈవో తాతాబ్బాయి, ఏటీడబ్ల్యూవో రామతులసి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా నాడు–నేడు పనులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ శనివారం పరిశీలించారు. ఏజెన్సీలో జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షల వివరాలను ఆయన తెలుసుకున్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో నాడు నేడు పథకంలో రూ.16.50 లక్షలతో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ ధనుంజయ్ గనోరే, సబ్ కలెక్టర్‌ర శుభం బన్సల్, రంపచోడవరం ఏపీవో (జనరల్) సీహెచ్ శ్రీనివాసరావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శారదాదేవి, డీఈవో రమేష్, ఎస్‌ఈ నర్సింహమూర్తి, జీఎస్‌డీవో సూర్యకుమారి పాల్గొన్నారు.

ఇద్దరు ఉన్నతాధికారులు సరెండర్

డీఐవో , ఏడీఎంహెచ్‌వోపై చర్యలు

సాక్షి, పాడేరు: జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ప్రభావతి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్‌లను వైద్యారోగ్య శాఖ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏజెన్సీలో శిశు మరణాలు అధికమవ్వడం, చిన్నారుల టీకాల కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం తదితర కారణాలతో ప్రభావతిపై చర్యలు తీసుకున్నారు. ఏజెన్సీలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన డాక్టర్ లీలాప్రసాద్ సరెండర్ చేసినట్టు కలెక్టర్ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

ఆధ్యాత్మికంగా కృషి అభినందనీయం

- పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా
- ఆయురమృత ఈశ్వరుడు విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన
- ఎమ్మెల్యే పాల్గుణ అధ్యక్షతన కార్యక్రమం



ఆయురమృత ఈశ్వరుడి జ్ఞాపికను అందజేస్తున్న ప్రకృతి వైద్యుడు రవివర్మ, ఎమ్మెల్యే పాల్గుణ

అనంతగిరి: మన్యాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషి అభినందనీయమని పర్యాటకశాఖామంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలోని ఆయుర్వేద ప్రకృతి వైద్యుడు రవివర్మ ఆధ్వర్యంలో 120 అడుగుల ఆయురమృత ఈశ్వరుడు విగ్రహ నిర్మాణానికి శనివారం స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా ధన్వంతరి అఖండ యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాంగణంలోని చేపట్టే కార్యక్రమాల విశిష్టతను మంత్రి రోజాకు ఆయుర్వేద ప్రకృతి వైద్యుడు రవివర్మ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ఆరోగ్యానికి అదిదేవత ధన్వంతరి అని అన్నారు. సకల రోగాల విముక్తికి మనమంతా ధన్వంతరిని పూజించాలని కోరారు. మంత్రి రోజాను చూసేందుకు గిరిజనులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, అరకు నియోజకవర్గ పరిశీలకుడు కొండపల్లి కొండబాబు, ఎంపీపీ శెట్టి నీలవేణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ తౌటినాయుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సూర్యానారయణ, నాయకులు స్వామి, గంగులు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- సహకరించాలని జేసీ శివ శ్రీనివాస్ సూచన
- రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్,డీఆర్వో అంబేద్కర్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఆయన సూచించారు. జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. పట్టభద్రుల ఓటర్లు 11,525 మంది ఉండగా, వీరిలో 7,861 పురుషులు, 3,661 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు.

భూ రీసర్వేతో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్




మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో జరుగుతున్న జగనన్న భూ హక్కు,భూ రక్ష పథకంలో చేపడుతున్న భూముల రీ సర్వేలో ఎదురయ్యే అన్ని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. రీసర్వే నోడల్ అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రీసర్వేను త్వరితగతిన నిర్వహించాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. రీసర్వేలో అమలుచేస్తున్న చట్టబద్ధమైన నోటీసులను తగిన విధంగా భద్రపరచాలని, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక బీరువాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, టీడీపీ పీవో పాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్ తదితరులు మాట్లాడారు. డీఆర్వో అంబేద్కర్,సర్వేశాఖ ఏడీ మోహనరావు పాల్గొన్నారు.

నేడు పొగును పండగ

• ఒడిశా, ఉత్తరాంధ్ర నుంచి రానున్న భక్తులు



ఆలయంలో కొలువైన పోతురాజు

అనంతగిరి: మండల కేంద్రంలోని పెద్దూరులో ఆదివారం పొగును (హోలీ) పండగ నిర్వహించేందుకు పోతురాజు ఆలయాన్ని ముస్తాబు చేశారు. గిరిజన సంప్రదాయ ప్రకారం ఈ పండగను నిర్వహిస్తారు. ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. రాత్రంతా జాగారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఒడియా భాగవతం, థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సుమారు 20 అడుగుల ఎత్తు వరకు కర్రలను పేర్చి, మధ్యలో జెండాను ఏర్పాటు చేస్తారు. సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నిప్పుపెడతారు. జెండా ఎటువైపుగా పడుతుందో ఆయా గ్రామాల్లో ఆ ఏడాది అంతా పంటలు సమృద్ధిగా పండుతాయని గిరిజనులు నమ్మకం. పూర్వీకుల నుంచి ఈ పండగ నిర్వహణ ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు దోనేశ్వరావు, సోమర తెలిపారు.

గ్రామగ్రామాన మహిళా పోరాట దినోత్సవం

మావోయిస్టు పార్టీ ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గణేష్

జి.మాడుగుల: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని ఈ నెల 8న గ్రామగ్రామాన జరుపుదామని, బ్రాహ్మణీయ హిందుత్వ పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుదామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆంధ్ర- ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ నుంచి శనివారం స్థానిక విలేకరులకు ప్రకటన అందింది. మహిళా పోరాటదిన స్ఫూర్తిని దెబ్బతీస్తూ మార్చి 8న మహిళలకు ముగ్గులు, వంటలు, అందాల పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందజేస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలను మనుధర్మ సూత్రాలకు అనుగుణంగా పురుషుడి సేవకురాలిగా ఉంచాలని కుట్రచేస్తున్నారని ఆరోపించారు. నేడు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సకల సమస్యలకు కారణమైన ఈప్రభుత్వాలు చేపట్టే మహిళా దినోత్సవాలను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ, పేదమహిళలు దాడులకు గురవుతున్నారని, చట్టాలు,న్యాయస్థానాలు, పోలీస్ వ్యవస్థ ద్వారా మహిళలకు ఎక్కడా రక్షణ, న్యాయం లభించడం లేదని ఆయన ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ మోదీ ప్రభుత్వం మహిళలపై అమలు చేస్తున్న బ్రాహ్మణీయ, హిందుత్వ, పితృస్వామ్యాన్ని అన్నిరూపాల్లో ప్రతిఘటిస్తూ పోరాడుదామని ప్రతినబూనుతూ ఏవోబీ జోన్లలో సభలు, సమావేశాలు ఊరేగింపులు జరపాలని మావోయిస్టు నేత గణేష్ పేర్కొన్నారు.

అడవిలో అగ్ని ప్రమాదాలు

నివారణపై దృష్టి సారించిన అటవీశాఖ

రాజవొమ్మంగి: అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేసవి కాలంలో చెట్ల ఆకులు రాలిపోవడంతో అటవీప్రాంతంలో చెత్త ఎక్కువగా ఉంటుంది. వీటికి నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపిస్తున్నాయి. రాజవొమ్మంగి అటవీప్రాంతంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వీటి నివారణకు గాను ఇప్పటికే 10 కిలోమీటర్ల పొడవు, రెండు కిలోమీటర్ల వెడల్పుతో ఫైర్‌లైన్లు ఏర్పాటుచేశామని స్థానిక అటవీ క్షేత్ర అధికారి అబ్బాయిదొర తెలిపారు. అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న దొరమామిడి బీటు, లాగరాయి, లబ్బర్తి బీట్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేశామని ఆయన వివరించారు. అటవీ ప్రాంతంలో మంటలు విస్తరించకుండా ఉండేందుకు తమ సిబ్బంది రెండు మీటర్ల వెడల్పున ఎండుపుల్లలు, ఎండుటాకులు లేకుండా శుభ్రపరుస్తారన్నారు. దీని వల్ల మంటలు వ్యాపించకుండా అక్కడి వరకు వచ్చి ఆరిపోతాయన్నారు.

పరారైన గంజాయి నిందితుల అరెస్టు



అరెస్టయిన నిందితులు

కొయ్యూరు: కన్నూరుపాలెంలో ఆటోలో గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను శనివారం పట్టుకొని అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. ఈ నెల 1న గొలుగొండ మండలం ఏటి గైరమ్మపేట నుంచి తాళ్లపాలెం వైపు ఆటోలో 50 కిలోల గంజాయిని తరలిస్తూ కన్నూరుపాలెంలో రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని ఢీకొని దాని డ్రైవర్ కాపారపు నాగరాజు (32) పట్టుబడి అరెస్టు అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆటో, 50 కిలోల గంజాయిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారైన నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన మాకిరెడ్డి రాజశేఖర్(31), రోలుగుంట మండలం కొత్తపట్నానికి చెందిన ఆటో యజమాని జన శ్రీను (45)లను కూడా శనివారం తాళ్లపాలెం కూడలి వద్ద పట్టుకొని అరెస్టు చేశామన్నారు. స్కూటీపై పరారవుతుండగా పట్టుకున్నామని, స్కూటీని సీజ్ చేసి నిందితులను కోర్టుకు తరలించామన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దాం

• పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా
• ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో సమావేశం



సమావేశంలో పాల్గొన్న పట్టభద్రులైన ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది

అనంతగిరి: ఉత్తరాంధ్ర జిల్లాలపై అవగాహన ఉన్న వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దామని పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. మండలంలోని చిలకలగెడ్డ సమీపంలోని కల్యాణమండపం వద్ద ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నాడు-నేడులో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పాలన అందుబాటులోకి తెచ్చారన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. అవగాహన ఉన్న వారిని గెలిపించాలని కోరారు. సీతంరాజు సుధాకర్ సేవా దృక్పథం కలిగిన వ్యక్తి అని ఆమె పేర్కొన్నారు. ఆయనను గెలిపించి, ఆ విజయాన్ని జగనన్నకు బహుమతిగా ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని, అందుకు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రతి ఒక్కరు కష్టపడాలని కోరారు.ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, అరకు నియోజకవర్గ పరిశీలకుడు కొండపల్లి కొండబాబు, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, యువజనవిభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

• రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా రంపచోడవరానికి సమీపంలోని గోపవరంలో శనివారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లతో కలిసి గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసుకునే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ప్రతి నెలా వలంటీర్లతో పాటు గృహసారథులు వారికి కేటాయించిన పరిధిలో పింఛన్లు ఇచ్చే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ ఎంత పెంచారు, ఇప్పుడు ఎంత ఇస్తున్నారో లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు అందజేశామని చెప్పారు. ఏజెన్సీలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఇప్పటి వరకు రూ.2 కోట్ల వరకు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సచివాలయాల కన్వీనర్ పండా రామకృష్ణదొర, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, యూత్ నాయకుడు రాపాక సుధీర్, సర్పంచ్ మంగా బొజ్జయ్య, మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోసు రమేష్‌బాబు, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, పాలొజు కాంతం , కాపారపు రూతూ, బొబ్బాశేఖర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ ప్రవీణ్

రంపచోడవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.ప్రవీణ్ సూచించారు. స్థానిక డీఎడ్ కళాశాలలో శనివారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ కోసం కొన్ని ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ ఎం.చినబాబు, న్యాయవాదులు కోలా సత్యప్రసాద్, సీహెచ్ సంతోష్‌కుమార్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని డి.రావిలంకలో నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్స్ కార్యక్రమంలో రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.ప్రవీణ్ మాట్లాడారు. మహిళాలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నాగార్జున, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.